క్లుప్తంగా

నేడు జీడితోటల పెంపకంపై అవగాహన సదస్సు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో జీడితోటల పెంపకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ డి.పారినాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి డైరెక్టర్ జనరల్ ఆర్‌పీ సిసోడియా ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, జీడితోటల పెంపకం, నిర్వహణలపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అలాగే లాభదాయకంగా జీడితోటలు ఎలా పెంచాలి.. పంటను ఎలా సంరక్షించుకోవాలన్న విషయాలపై అవగాహన కల్పించనున్నారన్నారు. జీడిరత్న పేరిట ఉత్తమ జీడిమామిడి రైతులకు అవార్డులు అందివ్వనున్నామన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

పాలకొండ రూరల్: వాహన చోదకులందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ ఎం. చంద్రమౌళి అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తనిఖీల్లో పట్టుబడితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. శుక్రవారం స్థానిక శ్రీకాకుళం రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు.

రైతుల సమక్షంలోనే స్టోన్ ప్లాంటేషన్



స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వెంకటరమణ

వీరఘట్టం: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను రైతుల సమక్షంలో చేపట్టాలని పాలకొండ ఆర్‌డీఓ ఎ.వెంకటరమణ సర్వే సిబ్బందికి సూచించారు. వీరఘట్టం మండలం విక్రమపురంలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొలతల్లో తేడాలు రాకుండా రైతుల భూములను వారికి అప్పగించాలన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ కె.జయప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ ఉన్నారు.

సురక్షతో అందరికీ ఆరోగ్యం



వైద్యశిబిరంలో సూచనలు చేస్తున్న వైద్యాధికారి దామోదరరావు

భామిని: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. దామోదరరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. బత్తిలిలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

భామిని: కొండపోడు వ్యవసాయంలో భాగంగా తుప్పలు, ఎండు ఆకులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని,ఈ సమయంలో అప్రమత్తంగా ఉంటే నష్టాన్ని తగ్గించవచ్చని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు మండలంలోని తివ్వాకొండ పరిసరాల్లోని గిరిజన గ్రామాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తూరు సెక్షన్ అధికారి లక్ష్మణమూర్తి, వీఆర్‌టీ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రావుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి, చినగుడబ, పెదగుడబ, వల్లరగుడబ, కొత్తపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కె.జయ శుక్రవారం పరిశీలించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎం.కృష్ణ, వీఆర్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో జ్యోతీబా పూలే గురుకుల ఆశ్రమ పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మావతి



కురుపాం: గుజ్జువాయిలో చిన్నారుల నోట్లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి ప్రజ్ఞ



గుమ్మలక్ష్మీపురం: తాడికొండ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి బుద్ధేశ్వరరావు



గుమ్మలక్ష్మీపురం: మండలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి అభిలాష్



జియ్యమ్మవలస: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

నులిపురుగులు.. నులిమేద్దాం!

జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) శుక్రవారం పంపిణీ చేశారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు వయసున్న పిల్లలతో అర్ధమాత్ర, రెండు నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారితో 400 ఎంజీ మాత్రలు మధ్యాహ్న భోజనం తర్వాత వైద్యుల పర్యవేక్షణలో మింగించారు. నులిపురుగులనేవి శరీరంలోని పోషకాలను గ్రహించి, అభివృద్ధి చెందే పరాన్నజీవులని, ఇవి ఉంటే రక్తహీనత, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఇవేవీ లేకుండా ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు. –పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



పాలకొండ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మందులు వేయిస్తున్న అధ్యాపకులు



పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మందులు వేస్తున్న సిబ్బంది



భామిని: భామినిలో గిరిజన గురుకులంలో మాత్రలు వేస్తున్న డాక్టర్ సోయెల్



భామిని: బాలేరులో విద్యార్థుల చేత మాత్రలు మింగిస్తున్న డాక్టర్ దీపికారాణి



పాలకొండ: నులి పురుగ నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



గరుగుబిల్లి : మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్

జియ్యమ్మవలస: రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను శుక్రవారం పరిశీలించిన ఆయన 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు, ఖర్చులు, జనరల్ ఫండ్ నిధులు–ఖర్చుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి గాను జిల్లాలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.16 కోట్లలో ఇప్పటికే రూ.8 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండలంలో 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి రూ.23 లక్షలు, జనరల్ ఫండ్ నుంచి రూ.8 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటికి సంబంధించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, లోపాలుంటే వెంటనే సరిదిద్దుకోవాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ దమలపాటి

వీరఘట్టం: నీటిఎద్దడి గ్రామాలను గుర్తించి రానున్న వేసవిలో తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, సూపరెంటిండెంట్ వెంకటరమణలతో మాట్లాడారు. తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పారిశుధ్య పనులు కూడా నిత్యం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయనతో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మాణిక్యచంద్రశేఖరరావు ఉన్నారు.


ధాన్యం సేకరణ సమయం పెంచాలి



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: వాతావరణం అనుకూలించక ఖరీఫ్ ధాన్యం పూర్తిస్థాయిలో నూర్పులు చేపట్టలేదని, ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ సమయం పెంచాలని వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు రణస్థలం రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన సలహామండలి సమావేశంలో రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, తదితరులు మాట్లాడుతూ.. ప్రస్తుత రబీ సీజన్‌లో అపరాల పంటలపై మంచు ప్రభావం ఉందని, రైతులకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి మాట్లాడుతూ, ధాన్యం సేకరణ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎల్.శ్యామ్, మన్మధరావు, రాజారావుతో పాటు ఏఓ ఎన్ని వాహిని, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.


జెడ్పీ సీఈవో పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్

కురుపాం: వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఏడాదిలో మండల పరిషత్ ద్వారా విడుదలైన నిధులు, వాటి వినియోగం, వ్యయాలపై ఆరాతీశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, ఎటువంటి తప్పులు లేకుండా రికార్డులు ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, ఈవోపీఆర్‌డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి



ఆర్టీసీ ఉద్యోగుల ర్యాలీ

పాలకొండ: ఆర్టీసీ డ్రైవర్లు రహదారి భద్రత నియమాలు పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పట్టణాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆర్టీసీ భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్లకార్డులు, బ్యానర్లతో పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి మాసోత్సవాలను 25 రోజులుగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జాగ్రత్తగా వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఓవర్ స్పీడ్ పనికిరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎస్. లక్ష్మణరావు, ఎంకేఎం రాజు, బి.రాంబాబు, ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రటరీ బాసూరు కృష్ణమూర్తి, డిపో ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిజమైన ఆదివాసీలకే టికెట్లు కేటాయించాలి

సీతంపేట: ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను నిజమైన ఆదివాసీలకే అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ట్రిబుల్ రైట్స్ ఫోరం చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలదొర, రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం రాష్ట్రంలో అన్ని ఎస్టీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయిస్తే శాసనసభ, పార్లమెంట్ సాక్షిగా మా గొంతుక వినిపిస్తామని పేర్కొన్నారు.


ప్రభుత్వ కళాశాలలో చేరండి



అవగాహన కల్పిస్తున్న చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

జియ్యమ్మవలస: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పడమే లక్ష్యంగా మండలంలోని చినమేరంగి జూనియర్ కళాశాల అధ్యాపకులు కృషి చేస్తున్నారు. శుక్రవారం చినమేరంగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, పదో తరగతి పబ్లిక్ పరీక్షల అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులంతా తమ కళాశాలలో చేరాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాలలోని కోర్సులు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహరాణా, ఉపాధ్యాయుడు నర్సింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా శివాలయం



రంగులద్దుకున్న శివాలయం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో కొత్తగా నిర్మించిన శివాలయం ప్రారంభానికి సిద్ధమైంది. తోటపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాల్లో ఒకటైన ఈ గ్రామంలోని గ్రామస్తులకు ప్రభుత్వం పునరావాసం కల్పించడంతో పాటు నిధులు కూడా మంజూరు చేశారు. గ్రామస్తుల చందాలు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధుల ఆర్థిక సహకారంతో గ్రామంలో శివాలయం నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు వేయడం కూడా పూర్తికాగా, త్వరలోనే ప్రారంభానికి సిద్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆశీల వేలంపాట ఖరారు

పాలకొండ: నగర పంచాయతీకి సంబంధించి ఆశీల వేలంపాటను శుక్రవారం నిర్వహించారు. రోజువారీ మార్కెట్, రోడ్డు మార్కెట్, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కబేళా వ్యాపారాల నుంచి రోజువారీ ఆశీలు వసూలు చేయడానికి నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో ఇద్దుబోయిన మహేష్ 9,71,000 రూపాయలకు పాట ఖరారు చేసుకున్నారు.

65 మద్యంసీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్‌లో అక్రమంగా విక్రయిస్తున్న 65 మద్యంసీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు పార్వతీపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి తెలిపారు. ఓ వ్యక్తి ఇంట్లో మద్యంసీసాలు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో అప్రమత్తమైన ఎస్‌ఈబీ సిబ్బంది అక్కడికి వెళ్లి, ఆకస్మిక తనిఖీలు చేయగా, మద్యంసీసాలు పట్టుబడినట్లు పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.జీవన్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి, మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. దర్యాప్తు నిమిత్తం కేసును కురుపాం ఎస్‌ఈబీ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన



వివాదాస్పద స్థలం వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న వివాదాస్పద స్థలాన్ని ఆర్డీఓ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. కళాశాల సమీపంలో ఉన్న స్థలం ప్రభుత్వానికి చెందినది కాగా.. ఇందులో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారని కొంతమంది ఇటీవల ఆర్డీఓ, కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ వెంకటరమణ, తహసీల్దార్ వరహాలు, మండల సర్వేయర్ వెంకటరావు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం



కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: మండలంలోని గొటివాడ గ్రామంలో గిరిజన మహిళల కోసం కుట్టుమిషన్ శిక్షణను ఎంపీపీ శెట్టి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈవో పద్మ ఆధ్వర్యంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో 45 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సంస్థలు ముందుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతీ గిరిజన మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణ అనంతరం శిక్షణార్థులకు తమ బ్యాంక్ ద్వారా రుణాలు కూడా అందిస్తామని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. మహిళలంతా ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

• పాలకొండ ఏఎస్‌డబ్ల్యూవో పి.శ్రీకాంత్



వసతిగృహ సంక్షేమ అధికారికి సూచనలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకాంత్

కురుపాం: వసతిగృహాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పాలకొండ ఏఎస్‌డబ్ల్యూవో పి.శ్రీకాంత్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు వసతిగృహాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు శుక్రవారం సందర్శించి, వాటి నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహాన్ని ఏఎస్‌డబ్ల్యూవో శుక్రవారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, సంబంధిత వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందాల్సిన సదుపాయాల విషయంలో జాప్యం చేయొద్దని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

• కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఎల్విన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం-2లో చిన్నారి బరువును స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం–2ను శుక్రవారం సందర్శించిన ఆయన చిన్నారుల ఎత్తు, బరువును స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయా వివరాలు రికార్డుల్లో సక్రమంగా ఉన్నవీ లేనివీ పరిశీలించారు. గర్భిణులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయడంతో పాటు వారు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులకే అందించాలని, అలా అయితేనే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారి సంపూర్ణ ఆరోగ్యానికి తగిన సలహాలు, సూచనలివ్వాలన్నారు. రక్తహీనత నివారణ కమిటీ సభ్యులుగా ఉన్న ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు చురుగ్గా పనిచేయాలన్నారు. పదేళ్ల లోపు వయసు పిల్లల మరణాల రేటును తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రిజమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత నివారణపై దృష్టిసారించాలన్నారు. అంతకుముందు దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను కలెక్టర్ రుచి చూసి, పరిశీలించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. ఆ తర్వాత దుడ్డుఖల్లు, బాలేసు, భద్రగిరి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, సదుపాయాలపై ఆరాతీశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో బి.చంద్రశేఖర్, తహసీల్దార్ బి.శివశంకర సత్యనారాయణ తదితరులు ఉన్నారు.